క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక


ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు మండలంలోని సారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులు నడిపేన జయంత్, రాయి నవీన్, రాయి కిరణ్‌తేజ, నడిపేన జయంత్‌రామ్‌లు ఎంపిక కాగా వారికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందనుంది. ఈ మేరకు పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం


స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

విజయనగరం: స్థానిక శ్రీక్షేత్రంలో ఉన్న అష్ట లక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగం వైభవంగా నిర్వహించారు. జ్యేష్ఠమాసం శుక్లపక్షం నాడు నిర్జల ఏకాదశి పురస్కరించుకుని, ఈ కార్యక్రమం చేశామని అర్చకులు తెలిపారు. స్వామి కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, అంపోలు లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దీపారాధన


దీపాలు వెలగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దీపారాధన శుక్రవారం చేశారు. వెండి మండపంలో కొలువైన స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలోని ప్రత్యేక ఊయలలో ఉంచి పూజలు చేశారు. సహస్రదీపాలంకరణ శోభలో స్వామికి ఊంజల్ సేవ చేశారు.

ఓటరు జాబితా సవరణపై సమావేశం


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నెల్లిమర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ ఓటరు జాబితా సవరణపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దారు సుదర్శనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నేతలంతా హాజరై, ఓటరు జాబితాలోని తప్పొప్పులపై పలు సూచనలు చేశారు. జాబితాలో చనిపోయిన ఓటర్ల పేర్లు, బోగస్ ఓట్లు తొలగించి పక్కాగా ఓటరు జాబితా తయారయ్యేలా చూడాలని తహసీల్దారు కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జనసేన పార్టీ నాయకుడు పతివాడ అచ్చిన్నాయుడు, అదపాక చిన్న, పిన్నింటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, కరెంట్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, వెంకన్నపాలెం, మల్యాడ గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

వేతనాలు చెల్లించండి మహాప్రభో..

- మధ్యాహ్న భోజనం కార్మికులు, శానిటేషన్ సిబ్బంది డిమాండ్


కస్పా ఉన్నత పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులు

విజయనగరం గంటస్తంభం: తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని అటు మధ్యాహ్న భోజనం కార్మికులు, ఇటు స్కావెంజర్స్(శానిటేషన్ సిబ్బంది) డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు స్థానిక కస్పా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విడివిడిగా శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. తొలుత మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన జరగ్గా, బకాయిపడిన జీతాలు ఇవ్వడంతో పాటు ప్రతి విద్యార్థికి రూ.20 చొప్పున మెనూ చార్జీలు పెంచాలని, అలాగే వంట కార్మికులకు నెలకు రూ.10 వేలు జీతం, రెండు జతల యూనిఫాం ఇవ్వాలని కోరారు. మెనూ చార్జీలు పెంచకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వమంటే ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం విపరీతంగా పెరిగిన ధరల నేపథ్యంలో ఇప్పుడు విద్యార్థికి ఇచ్చే రూ.5.88, రూ.8.57లతో ఎలా మంచి భోజనం ఇవ్వగలమని నిలదీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై చిత్తశుద్ధి ఉంటే వారి మెనూ చార్జీలు పెంచాలని సవాలు విసిరారు. 2024 అక్టోబరులో చార్జీలు పెంచినట్లు ప్రకటించినా ఇప్పటివరకు ఆ బిల్లుల ఊసే లేదన్నారు. నెలల తరబడి బిల్లులు, జీతాలు చెల్లించకుంటే ఎలా బతకాలన్నారు. జూన్ 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం నాటికి బిల్లులు, జీతాలు చెల్లించకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. స్కావెంజర్లు చేసిన ఆందోళనలో వారి తరఫున సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు మాట్లాడుతూ ఐదారు నెలలుగా శానిటేషన్ సిబ్బంది వేతనాలు బకాయిగా పడి ఉన్నాయని, అరకొర జీతానికి పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే వారి జీతాలు ఇలా నెలల తరబడి ఉంచేస్తే ఎలా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా వారి బకాయి వేతనాలు చెల్లించి, ఆదుకోవాలన్నారు. అలాగే వారి జీతాన్ని రూ.4 వేలు నుంచి రూ.10 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు.


బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య


కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ తెలిపారు. మండలంలోని వీటీ అగ్రహారం ఇందిరానగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ప్రవేశాలకు సంబంధించి, క్యాంపెయిన్ శుక్రవారం నిర్వహించారు. మూడేళ్ల వయసు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఎటువంటి ఒత్తిడి లేని నాణ్యమైన విద్య కావాలంటే అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పాలన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా కలిగే సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రూప, రోహిణి, శ్రీదేవి, శ్యామల, మంగ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగుల పట్ల ప్రేమతో ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌వో డాక్టర్ రాణి

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ అధికారిణి డాక్టర్ కె.రాణి

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ రోగుల పట్ల ప్రేమగా నడుచుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ అధికారిణి డాక్టర్ కె.రాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో శుక్రవారం హెచ్ఐవీ ఉన్న క్షయ వ్యాధిగ్రస్తులకు పోషక ఆహారం గల 8 రకాల వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషక ఆహారం ఎల్లప్పుడు తప్పకుండా వాడాలన్నారు. సుగర్, బీపీ మాదిరిగానే రోజూ మందులు వాడుతూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. హెచ్ఐవీ సోకిన వారు క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడి, మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ డాక్టర్ ఎ.బాబా, ఐసీటీసీ సెంటర్ల జిల్లా సూపర్‌వైజర్ సాక్షి గోపాల్‌రావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి 36వ డివిజన్ సమస్యలు


ప్రజాసమస్యలు వింటున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: స్థానిక 36వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించిన నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు దృష్టికి అక్కడి వారు తమ సమస్యలను తీసుకువెళ్లారు. ఏడాదిగా తమ డివిజన్‌లో అభివృద్ధి పనులు జరగడం లేదని, దీంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రోడ్లు, కాలువలు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారానికే డివిజన్లలో పర్యటిస్తున్నామని, తమకు తెలిసిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలి పద్మావతి, ఏవో సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనఫెస్ట్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో అనఫెస్ట్ 2025 వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ విశాఖపట్నం అనాటమీ విభాగం అధిపతి రవీంద్రకిశోర్ జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు శరీర భాగాల చిత్రాలు, మాదిరిలను ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

విజయనగరం టౌన్: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ ఆదేశాలతో సమాఖ్య ప్రధాన కార్యాలయం గుంటూరుతో పాటు అన్ని జిల్లా కేంద్ర కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో సమాఖ్య 42వ వార్షికోత్సవ జెండా ఆవిష్కరించి, వెబ్‌సైట్ ప్రారంభిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పార్వతి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. జూన్ 10 నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 24వ తేదీన ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

కొత్తపేటలో దాహం కేకలు

- పది రోజులుగా తాగునీటి సరఫరా బంద్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. పది రోజుల నుంచి తాగునీటి సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంతంగా బోర్లు ఉన్న వారి ఇళ్లకు వెళ్లి మరీ తాగేందుకు నీరు తెచ్చుకుంటున్నామని, స్నానాలకు, ఇతర అవసరాలకు నీరు లేకుండా పోయిందని చెబుతున్నారు. ఇదే సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇదే విషయంలో కార్యదర్శి బంగారాజును సంప్రదించగా, చంపావతి నదిలోని పంప్‌సెట్ మరమ్మతులకు గురైందని, శనివారం నాటికి బాగుచేసి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి ఇక్కట్లు లేకుండా గొర్లిపేట పంప్‌హౌస్ నుంచి తాగు నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. అయితే విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఆటంకం ఏర్పడిందన్నారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాలు


వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు సరిపడక ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఓటర్లకు సరిపడ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఓటరు జాబితాపై జరిగిన ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశానికి హాజరై రిటర్నింగ్ అధికారి సుదర్శనరావుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సవరవిల్లి పంచాయతీలో మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యలో హెచ్చు తగ్గులున్నాయని దీంతో 10 గ్రామాల ప్రజలు ఓట్లు వేసేందుకు అర్ధరాత్రి సమయం దాటుతోందన్నారు. మూడు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను సమానంగా సర్దుబాటు చేయాలన్నారు. జగ్గయ్యపేట ఓటర్లు ఏడు కిలోమీటర్ల ప్రయాణం చేసి మరీ చాకివలస వచ్చి ఓట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొందని, వారికి వారి గ్రామంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. గుడివాడ పరిధిలోని పోలింగ్ కేంద్రం ఇరుకుగా ఉండడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని, తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. పోలింగ్ కేంద్రాన్ని గ్రామ సచివాలయం భవనంలోకి మార్చాలన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ మహేష్

డెంకాడ: శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో రోజూ గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు పుస్తక పఠనం, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు క్యారమ్, చదరంగం వంటి క్రీడల్లో మెలకువలు నేర్పించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఇదివరకు నిర్వహించిన ఆటపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు లైబ్రేరియన్ మహేష్ బహుమతులు అందజేశారు.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం


రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం డీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా, గాజులరేగలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు పరీక్ష రాశారు. పరీక్షలు పకడ్బందీగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం


డెంకాడ: వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు


నెల్లిమర్ల రూరల్: బర్లపేట ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పూజలు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేటలో కొత్తగా నిర్మించిన శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, పూర్ణాహుతి, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, గోదర్శనం, శాంతి కల్యాణం వంటివి చేశారు. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎమ్మెల్యే లోకం నాగమాధవి తదితరులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం విగ్రహ ఊరేగింపు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారిని వేడుకున్నారు. ఏడాదంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని పూజించారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట, బర్లపేటల్లో శుక్రవారం జరిగిన రామమందిరం ప్రతిష్ఠా మహోత్సవాలకు నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఇతర నేతలు హాజరై, స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రజలందరిపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని, జనమంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు సలహా మండలి సభ్యుడు ఎ.శ్రీరాములునాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.సన్యాసినాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు సీహెచ్ తులసి, సీనియర్ నాయకుడు జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయండి


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: వీధి విక్రయదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమై, సర్వేపై సమీక్షించారు. నగరంలో 8,424 మంది వీధి విక్రయదారులు ఉన్నట్లు తెలిసిందని, ఇప్పటివరకు 3,755 మందిని మాత్రమే నమోదు చేశారన్నారు. మిగిలిన 4,669 మంది వీధి విక్రయదారుల వివరాలను నమోదు చేసే ప్రక్రియను సోమవారంలోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశంగా వీధివిక్రయదారుల సర్వే నిర్వహించాల్సి ఉందని, సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే పీఎం స్వానిధిలో కొంతమందిని నమోదు చేశారని, కొత్తవారిని కూడా గుర్తించాలన్నారు. అన్ని విషయాలను సమగ్రంగా ధృవీకరించిన తర్వాత మాత్రమే తగు పత్రాన్ని సమర్పించాలన్నారు. అలాగే యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. పురమిత్ర యాప్‌ను నగర ప్రజలందరితో డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఇదిలా ఉండగా, సాయంత్రం సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమిషనర్ సమావేశమై, పన్నుల బకాయిలను వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి


గెలుచుకున్న బహుమతులు చూపిస్తున్న విద్యార్థులతో నిర్వాహకులు

విజయనగరం టౌన్: విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసంబంధాల అధికారి డి.రమేష్ విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. కాలం చాలా విలువైనదని, ప్రతిఒక్కరూ సమయం గొప్పదనం తెలుసుకోవాలన్నారు. ఎంతోమంది సమయాన్ని వృథా చేస్తూ ఉంటారని, అలా చేయకూడదన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశలో ప్రతి విరామ సమయాన్ని పుస్తకాలు చదవడం ద్వారానో ఏదో ఒక విషయం నేర్చుకోవడం ద్వారానో కాలం వినియోగించుకోవాలని తెలిపారు.

ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టిసారించాలన్నారు. చిన్నప్పటి నుంచే ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని, ఆ లక్ష్య సాధన దిశగా పనిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, పాటలు, క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి, రిసోర్స్‌పర్సన్ సన్యాసిరావు, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.